సాక్షి బాపట్ల

ఆదివారం । 23 । జూన్ । 2024



రైతులకు సన్మానం

వినుకొండ(నూజెండ్ల): ఏరువాక పౌర్ణమి పండుగ ముగింపు సందర్భంగా నూజెండ్ల మండలం ఉప్పలపాడులో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతు కుటుంబాలను సత్కరించారు.



బండ్లమ్మ సేవలో..

పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలో ఉన్న బగళాముఖి అమ్మవారి దేవాలయాన్ని హైకోర్టు ప్రొటోకాల్ రిజిస్ట్రార్ రాఘవస్వామి కుటుంబ సమేతంగా సందర్శించారు.



సామూహిక హారతులు

నగరం: జిల్లేపల్లిలో ఉన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామూహిక హారతులు నిర్వహించారు.

న్యూస్‌రీల్

మృతుల కుటుంబాలకు కరణం పరామర్శ



ఆస్పత్రిలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే కరణం

చీరాల: రామాపురం సముద్రతీరంలో సరదాగా గడిపేందుకు వచ్చిన ఏలూరు జిల్లా దుగ్గిరాలకు చెందిన నలుగురు యువకులు శనివారం గల్లంతై మృతి చెందారు. చీరాల ఏరియా వైద్యశాలలోని మార్చురీలో ఉన్న మృతదేహాలను బలరామకృష్ణమూర్తి పరిశీలించారు. మృతి చెందిన వారి కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షులు ఆసాది అంకాలరెడ్డి, బొడ్డు సుబ్బారావు, మాజీ ఎంపీపీ గవిని శ్రీనివాసరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, అక్కల శ్రీనివాసరెడ్డి, అక్కల శ్రీనివాసరెడ్డి, గుంటూరు సుబ్బారావు, బక్కా అద్దంకిరెడ్డి, మోహన్‌కుమార్ ధర్మా, బుర్ల సాంబశివరావు, బోయిన కృష్ణ, మున్సిపల్ కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగం ఆశ చూపి మోసం

- ఫేక్ లింక్‌ల ద్వారా రూ.5.39 లక్షల మోసం
- ఫిర్యాదు చేసిన బాధితురాలు

కారంచేడు: నిరుద్యోగ యువతపై ఘరానా మోసాలు జరుగుతూనే ఉన్నాయి. ఒక రకమైన మోసం గుర్తించి వాటికి దూరంగా ఉంటున్న యువతకు మరో రకమైన మోసాన్ని తెరపైకి తెస్తున్నారు ఘరానా కేటుగాళ్లు. ఈ క్రమంలోనే కారంచేడుకు చెందిన ఒక నిరుద్యోగికి పంపిన కొన్ని రకాల లింక్‌ల ద్వారా నమ్మబలికించి చివరకు రూ 5.39 లక్షలను కట్టించుకొన్నారు. చివరకు ఫోన్ స్విచ్‌ఆఫ్ చేసి గ్రూప్‌ను డిలీట్ చేయడంలో మోసపోయానని గుర్తించి యువతి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై కే సురేష్ వివరాల మేరకు.. కారంచేడుకు చెందిన జాగర్లమూడి లక్ష్మీనారాయణ కుమార్తె అలేఖ్య ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవల ఒక వాట్సప్ గ్రూప్ వచ్చింది. దానిలో తన మొబైల్ నంబర్ కూడా యాడ్ అయి ఉంది. ఆ గ్రూప్‌లో 'వర్క్ ఫ్రం హోమ్' ఉన్న మెసేజ్‌లను చదివింది. తనకు ఉద్యోగం వస్తుదేమో అని ఆశతో వారు అడిగిన సమాచారం అందించింది. వారు కొన్ని లింక్‌లు ఇచ్చి వాటిని పూర్తి చేయమన్నారు. వారు ఇచ్చిన అన్ని రకాల టాస్క్‌లను పూర్తి చేసిన తరువాత మరో నలుగురుతో కూడిన టెలిగ్రాం గ్రూపును కూడా సిద్ధం చేశారు. తరువాత ఆ గ్రూప్‌ను తొలగించారు. ఈ లోపులోనే వారు రూ.5,38,980 అకౌంట్‌కు డబ్బు పంపించుకున్నారు. తరువాత వారు అకౌంట్‌ను ఫ్రీజ్ చేశారని ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫేక్ లింక్‌ల ద్వారా అనేక మంది డబ్బును మోసపోతున్నారని, యువతీ, యువకులు ఈ విషయాలను గుర్తించాలన్నారు. ఎవరూ డబ్బులు కట్టి మోసపోవద్దని ఆయన హితవు పలికారు.

28న మెగా జాబ్ మేళా



నెహ్రూనగర్ : సమర్ధనం దివ్యాంగుల సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు 28వ తేదీన మెగా జాబ్ మేళాను నిర్వహించనున్నారు. ఆ రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు గుంటూరు అమరావతి రోడ్డులోని హిందూ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో మేళా ఉంటుంది. ఈ మేరకు సమర్ధనం రీజినల్ మేనేజర్ ఎం ఆర్‌కే పరమహంస తెలిపారు. శనివారం అమరావతి రోడ్డులో మేళాకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ హిందూ ఫార్మసీ కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు చేతుల మీదుగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులలో సామర్థ్యం, ఆలోచన, లక్ష్య సాధనకు తపన స్ఫూర్తిదాయకంగా ఉంటాయని అన్నారు. మానసికంగా చాలా దృఢత్వం కలిగి ఉంటారని పేర్కొన్నారు. వారి కోసం పనిచేస్తున్న సమర్ధనం దివ్యాంగుల సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ మేళాను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 18– 35 ఏళ్ల వయసు కలిగి పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ చదివిన వారికోసం 30కి పైగా కంపెనీలు మేళాలో ఎంపికలు నిర్వహిస్తాయని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు రెస్యూమ్, ఆధార్ కార్డు, విద్యార్హత ధ్రువపత్రాలు తీసుకొని 28న నేరుగా హాజరు కావాలని కోరారు. వివరాలకు 63648 67800, 63648 67801, 63648 67802, 63648 67803 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ప్రయాణం సురక్షితమేనా?

- స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌పై దృష్టి సారించిన రవాణాశాఖ
- నిత్యం తనిఖీలు
- జిల్లాలో 722 స్కూల్ బస్సులు
- 112 బస్సులు కాలం చెల్లినవిగా గుర్తించిన రవాణాశాఖ
- ఇప్పటివరకు 257 ఎఫ్‌సీ రెన్యువల్

బాపట్లటౌన్: మీ పిల్లలను మా స్కూలులో చేర్పించండి బస్సు సౌకర్యం ఉందని చెప్పి తల్లిదండ్రులను ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఆకర్షిస్తుంటాయి. పిల్లలను సురక్షితంగా ఇంటికి చేర్చాల్సిన యాజమాన్యాలు బస్సులపై ఫిట్‌నెస్‌పై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. దీంతో అక్కడక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఉదయం బస్సులో స్కూలుకు పంపిన పిల్లలు సురక్షితంగా ఇంటికి చేరే వరకు తల్లిదండ్రులు ఆందోళన చెందుతుంటారు. జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలలు ప్రారంభం కావడంతో బస్సుల సామర్థ్యంపై రవాణాశాఖాధికారులు దృష్టి సారించారు. తనిఖీలు చేసి ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తున్నారు. బడి బస్సుల భద్రతపై అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. గతేడాది జారీ చేసిన ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కాలపరిమితి ఈనెల 15వ తేదీతో ముగియడంతో కొత్త సర్టిఫికెట్ల జారీ కోసం రవాణాశాఖ కార్యాలయం వద్ద క్యూ కడుతున్నారు. దీంతో బడి బస్సుల సామర్థ్యాన్ని అధికారులు పరిశీలిస్తున్నారు.

ఫిట్‌నెస్ పరీక్షలు ఇలా...

స్కూల్ బస్సులను మోటారు వాహనాల తనిఖీ అధికారి స్వయంగా డ్రైవ్ చేస్తారు. బస్సు లోపల, బయట పూర్తిగా పరిశీలించి మరమ్మతులు చేయాల్సినవి గుర్తిస్తారు. డ్రైవింగ్‌కు సంబంధించి బ్రేకులు, క్లచ్, స్టీరింగ్, హ్యాండ్ బ్రేక్, బ్యాటరీ, ఇంజిన్‌కు సంబంధించి పలు విభాగాలను పరిశీలించి ఏమైనా కండీషన్‌లో లేకుంటే వాటిని వెంటనే సరిచేయించే విధంగా ఆదేశాలు జారీ చేస్తారు.



స్కూల్ బస్సులో తనిఖీ చేస్తున్న రవాణాశాఖాధికారులు

ఆన్‌లైన్‌లో ఈ–స్లాట్ తేదీల ఖరారు

జిల్లాలోని బాపట్ల, చీరాల మోటారు వాహనాల తనిఖీ అధికారి కార్యాలయాల్లో స్కూళ్లు, కళాశాలల బస్సుల సామర్థ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. వాహనాలు ఎలా ఉండాలనే విషయమై ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలకు పలు సూచనలు చేశారు. వాహన ఫిట్‌నెస్ ధ్రువీకరణ కోసం ముందుగా ఆన్‌లైన్‌లో యాజమాన్యాలు ఈ–ప్రగతి చేయించుకునేందుకు రవాణాశాఖ కార్యాలయం అధికారులు ఓ తేదీని కేటాయిస్తారు. ఆ ప్రకారం వాహనాన్ని రవాణా శాఖ కార్యాలయానికి తీసుకొస్తే, ఫిట్‌నెస్ తనిఖీలు నిర్వహిస్తారు.

పాటించాల్సిన నిబంధనలు

పాఠశాల బస్సును నడిపే డ్రైవర్లు బీపీ, షుగర్, కంటి సంబంధిత సమస్యలు లేవని సర్టిఫికెట్ సమర్పించాలి.

- బస్సుకు సంబంధించిన అన్ని లైట్లు పనిచేయాలి. రిఫ్లెక్టివ్ టేపును బస్సుకు నాలుగు వైపులా అతికించాలి. బస్సుకు ఉన్న గ్లాసులన్నీ పటిష్టంగా ఉండేలా చూడాలి,
- బస్సు నుంచి అధిక మొత్తంలో బ్లాక్ స్మోక్ (పొగ) రాకుండా చూసుకోవాలి. బ్రేక్ కండిషన్‌లో ఉండాలి. హ్యాండ్ బ్రేక్, స్పీడో మీటర్ సక్రమంగా పనిచేయాలి. స్టీరింగ్, టైర్లు కండిషన్ సరిచూసుకోవాలి.
- ప్రతి బస్సులో మందులు, పరికరాలతో కూడిన ప్రథమ చికిత్స బాక్స్ అందుబాటులో ఉంచాలి. వారానికోసారి ప్రిన్సిపాల్, సంబంధిత అధికారి ఈ బాక్స్ తనిఖీ చేయాలి. నెలకోసారి పేరెంట్స్ కమిటీ పరిశీలించడంతోపాటు, దీనికోసం ప్రత్యేక రిజిస్టర్ నిర్వహించాలి.
- బస్సులో సీట్ల కింద బ్యాగులు ఉంచుకునేందుకు అరలు ఏర్పాటు చేయాలి. సైడ్‌విండోలకు మధ్యలో మూడు అంగుళాలకు మించని దూరంలో అడ్డంగా మూడు లోహపు కడ్డీలు అమర్చాలి. ప్రతి విద్యాసంస్థ యాజమాన్యం, ట్రాన్స్‌పోర్టు, పోలీస్, విద్యాశాఖల సౌజన్యంతో విద్యార్థులకు ఏడాదికి ఒకరోజు రోడ్ సేఫ్టీ తరగతులు నిర్వహించాలి.
- బస్సు నడిపే డ్రైవర్లు ఐదేళ్ల అనుభవం, 60 ఏళ్ల లోపు వయసు కలిగి ఉండాలి.
- బస్సు ఫుట్ బోర్డుపై మొదటి మెట్టు భూమి నుంచి 325 మిల్లీమీటర్ల ఎత్తుకు మించరాదు. మెట్లు జారకుండా ఉండేలా లోహంతో చేయించాలి.
- బస్సులో అత్యవసర ద్వారం, మంటలను ఆర్పే పరికరం ఏర్పాటు చేసుకోవాలి.
- అత్యవసర ద్వారం అని తెలిసేలా స్పష్టంగా కనిపించే విధంగా రాయించాలి. బస్సులో ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు పట్టుకునేం దుకు వీలుగా బస్సు ముందు తలుపు మెట్లకు సమాంతరంగా రెయిలింగ్లు ఏర్పాటు చేయాలి
- విద్యార్థులు బస్సు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు బస్సు అటెండెర్లు పర్యవేక్షించాలి.
- పాఠశాల వద్ద పార్కింగ్‌కు ప్రత్యేక స్థలం కేటాయించాలి. బస్సులో అటెండర్ తప్పనిసరి.
- సీటింగ్ కెపాసిటీకి మించి విద్యార్థులను ఎక్కించకూడదు. బస్సు ఎడమవైపు ముందు భాగంలో యాజమాన్యం వివరాలు, స్కూల్ బాయ్ అండ్ గర్ల్ ఇమేజ్ పొందుపర్చాలి.
- బస్సు బయలుదేరే సమయం, ఆగే స్థలాల రూట్ ప్లాన్ ఉంచాలి. విద్యార్థుల సంఖ్య, వారి పూర్తి వివరాలు, అలాగే డ్రైవర్ వివరాలు బస్సులో ఏర్పాటు చేయాలి.
- ప్రతి నెలా బస్సు కండిషన్ యాజమాన్యాలు, పాఠశాల పేరెంట్స్ కమిటీ తనిఖీ చేయాలి. బస్సులో ఫిర్యాదుల పుస్తకం ఉంచాలి. బస్సులో అటెండర్ తప్పకుండా యూనిఫామ్ ధరించాలి
- వెనుక నుంచి వచ్చే వాహనాలను చూసేందుకు వీలుగా బస్సు డ్రైవర్‌కు కుడి, ఎడమ వైపు బయట, లోపల మిర్రర్లు ఏర్పాటు చేయాలి. బస్సు ఎట్టి పరిస్థితుల్లో రాంగ్ రూట్లో ప్రయాణించరాదు.

ఫిట్‌నెస్ లేని బస్సులను సీజ్ చేస్తాం



నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రతి స్కూల్ బస్సు రవాణాశాఖ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. జిల్లాలో మొత్తం 722 బస్సులు ఉండగా వాటిల్లో చీరాల పరిధిలో 75, బాపట్ల పరిధిలో 37 బస్సులు చొప్పున జిల్లాలో మొత్తం 112 బస్సులు 15 సంవత్సరాలు పైబడినవిగా గుర్తించాం. వాటిల్లో పిల్లలను రవాణా చేయరాదని చెప్పాం. రోడ్డు మీద తిరగటానికి 610 బస్సులకు మాత్రమే అర్హత ఉంది. వాటిల్లో ఇప్పటివరకు 353 బస్సులు ఎఫ్‌సీలు పూర్తిచేశారు. 257 బస్సులు పెండింగ్‌లో ఉన్నాయి. త్వరలో ఎఫ్‌సీలు పూర్తిచేయకపోతే ఆ బస్సులను సీజ్ చేస్తాం.

– ఆర్.సురేష్, జిల్లా రవాణాశాఖాధికారి

రైల్వే శాఖలో పెండింగ్ ప్రాజెక్టులపై దృష్టి

- డీపీఆర్‌లు త్వరగా సిద్ధం చేయాలి
- తెనాలిలో వందే భారత్ హాల్ట్‌పై పరిశీలన
- కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని



మాట్లాడుతున్న డాక్టర్ పెమ్మసాని

గుంటూరు వెస్ట్: రాష్ట్రంతోపాటు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టులకు సంబంధించిన పనులను త్వరగా పూర్తి చేయాలని గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక రోడ్లు, భవనాలు అతిథి గృహంలో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి, జాయింట్ కలెక్టర్ రాజకుమారి, రైల్వేశాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం డాక్టర్ పెమ్మసాని విలేకరులతో మాట్లాడుతూ ఇన్నర్ రింగ్‌రోడ్డు, పెదపలకలూరు, మంగళగిరి, గుంటూరు శంకర్‌విలాస్, నెహ్రూనగర్, సంజీవయ్యనగర్ ప్రాంతాల్లో ఉన్న రైల్వే గేటు వద్ద ఓవర్‌బ్రిడ్జిల నిర్మాణం, శ్యామలానగర్ రైల్వే అండర్‌బ్రిడ్జి నిర్మాణాలకు అనుమతుల వివరాలు తెలుసుకున్నట్లు చెప్పారు. నందివెలుగు రోడ్డులోని రైల్వే ఓవర్‌బ్రిడ్జి పనుల వివరాలపై సమీక్షించారు. పనుల వారీగా అనుమతుల మంజూరుకు రైల్వే శాఖ, ఆర్ అండ్ బీ, స్థానిక సంస్థల కలిసి పూర్తిచేస్తాయన్నారు. జిల్లాలో 15 వరకు రైల్వే బ్రిడ్జిలు రూ.వెయ్యి కోట్ల నుంచి రూ.2 వేల కోట్ల పనులకు ఇప్పటికే డీపీఆర్ రూపొందించారన్నారు. వందేభారత్ రైలు తెనాలిలో నిలిపేలా, బెంగళూరుకు పగటిపూట కూడా గుంటూరు నుంచి రైలు సౌకర్యం కల్పించే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్‌ఎం రామకృష్ణ, ఆర్ అండ్ బీ ఎస్‌ఈ శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితులను అరెస్టు చేయాలి

- గంజాయి, మత్తు పదార్థాలను నిర్మూలించాలి
- ఐద్వా, ఎస్‌ఎఫ్‌ఐ, సీఐటీయూ, ప్రజాసంఘాల నిరసన

చీరాల అర్బన్: చీరాల రూరల్ మండలం ఈపూరుపాలెంలో జరిగిన సుచరిత హత్యాచార కేసులో నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా), ఎస్‌ఎఫ్‌ఐ, ప్రజాసంఘాలు, సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ, మానవహారాన్ని నిర్వహించారు. ఐద్వా బాపట్ల జిల్లా కన్వీనర్ సుభాషిణి మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా మహిళలపై అత్యాచారాలు, హత్యలు ఆగడం లేదన్నారు. రాష్ట్రంలో గంజాయి, మత్తు పదార్థాలు విచ్చలవిడిగా ఉపయోగించడం వల్ల వాటికి బానిసైన యువకులు ఇటువంటి ఘటనలకు పాల్పడుతున్నారన్నారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం మత్తు పదార్థాలను నిర్మూలించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బాధిత కుటుంబానికి అండగా నిలిచి ఆదుకోవాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మనోజ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి ఎమ్మెల్యేలు ప్రమాణస్వీకారం చేసిన రోజున సుచరిత అత్యాచారం, హత్యకు గురికావడం రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదనేది స్పష్టమవుతుందన్నారు. సుచరిత కుటుంబానికి రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పరామర్శించి నిందితులను 48 గంటల్లో అరెస్టు చేస్తామని భరోసా ఇచ్చారని, ఇచ్చిన మాటను రాష్ట్ర ప్రభుత్వం నిలబెట్టుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనకు పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. సుచరిత కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు ప్రజాసంఘాలు అండగా ఉంటాయన్నారు. ముక్కోణం పార్కు సెంటర్ నుంచి గడియారస్తంభం సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎన్.బాబూరావు, వృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ కొండయ్య, రజక వృత్తిదారుల జిల్లా కార్యదర్శి జనార్దన్, ఐద్వా జిల్లా నాయకురాలు లక్ష్మి, డీవైఎఫ్‌ఐ నాయకులు భగవాన్‌దాస్, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు వెంకటేష్, ప్రసాద్, రాంబాబు, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



గడియార స్తంభం సెంటర్‌లో మానవహారం నిర్వహిస్తున్న పలు సంఘాల నాయకులు

జిల్లాలో డయేరియాను పూర్తిగా అరికట్టాలి

- ప్రజలకు పూర్తిగా అవగాహన కల్పించాలి
- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

బాపట్లటౌన్: జిల్లాలో డయేరియాను పూర్తిగా అరికట్టాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. డయేరియా వ్యాధి నిర్మూలనపై జిల్లా స్థాయి అవగాహన కార్యక్రమం శనివారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ముందస్తు జాగ్రత్త చర్యలతోనే డయేరియా వ్యాధి వ్యాప్తిని అరికట్టగలమన్నారు. కలుషిత నీరు తాగకుండా ప్రజలకు అవగాహన కల్పించడమే ముఖ్యమన్నారు. ప్రజలకు సరఫరా చేస్తున్న తాగునీటిని అధికారులు తప్పనిసరిగా పరీక్షించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీడీవోలు, పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్లు తాగునీటి నమూనాలను పరీక్షలకు పంపాలన్నారు. అధికారులు నిర్లక్ష్యం చేయరాదన్నారు. జూలై 1వ తేదీ నుంచి ఆగస్టు నెల చివరి వరకు డయేరియా వ్యాధి నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా చేపట్టాలన్నారు. ఇంటింటా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఆరోగ్యంపై ఆరోగ్య కార్యకర్తలు ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. గ్రామ సచివాలయాల వారీగా కార్యక్రమాల నిర్వహణపై అధికారులు సూక్ష్మ ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. చిన్నారుల్లో డయేరియా మరణాలు పూర్తిగా అరికట్టడానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. మలేరియా డెంగీ విష జ్వరాలు ప్రబలకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. గృహాల మధ్య వర్షపు నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. మురికి నీటి కుంటలు, కాల్వలను శుభ్రపరచాలన్నారు. అవగాహన కార్యక్రమాల్లో భాగంగా పాఠశాలల్లో క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించాలన్నారు. ఐదేళ్లలోపు చిన్నారుల్లో డయేరియా వచ్చే అవకాశం ఉన్నందున ముందస్తుగా జింక్ మాత్రలు పంపిణీ చేయాలన్నారు. చేతులు పరిశుభ్ర పరుచుకోవడంపై పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల్లో అవగాహన కల్పించాలన్నారు. పరిశుభ్రమైన శుద్ధ జలాలను ప్రజలకు సరఫరా చేయడానికి ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీ రాజ్ ఇంజినీర్లు సమన్వయంతో పనిచేయాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్ విజయమ్మ, జెడ్పీ డిప్యూటీ సీఈఓ మోహన్‌రావు, డీపీఓ రవికుమార్, డీఈఓ నారాయణ, అనుబంధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల కలెక్టర్ రంజిత్ బాషా బదిలీ

సాక్షి ప్రతినిధి,గుంటూరు: బాపట్ల జిల్లా కలెక్టర్ రంజిత్ బాషాను కర్నూలు జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేశారు. ఆయన స్థానంలో జాయింట్ కలెక్టర్ శ్రీధర్‌కు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ప్రభుత్వం శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. గుంటూరు కలెక్టర్‌గా 2012 బ్యాచ్‌కి చెందిన ఎస్.నాగలక్ష్మిని నియమించారు. ఆమె ప్రస్తుతం విజయనగరం కలెక్టర్‌గా పనిచేస్తున్నారు. అనంతపురంలోనూ విధులు నిర్వర్తించారు. గతంలో గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్‌గా పని చేశారు. ప్రస్తుత కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డిని జీఏడీలో రిపోర్ట్ చేయాల్సిందిగా ఆదేశాలు జారీ అయ్యాయి. ఆయన 2022లో జిల్లాల పునర్ విభజన తర్వాత గుంటూరు జిల్లా కలెక్టర్‌గా నియమితులయ్యారు. రెండు సంవత్సరాల రెండు నెలల కాలంలో జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లడంలో కృషి చేశారు.

బాల కార్మికులతో వెట్టిచాకిరీ చేయిస్తే కఠిన చర్యలు

కార్మిక శాఖాధికారి రామకృష్ణ

చీరాల రూరల్: బాల కార్మికులను పనుల్లో పెట్టుకుని వెట్టిచాకిరీ చేయిస్తే కఠిన చర్యలు తప్పవని అసిస్టెంట్ కార్మిక శాఖాధికారి రామకృష్ణ హెచ్చరించారు. కార్మికశాఖ, షాడోస్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం చైల్డ్ లేబర్‌పై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు బాల కార్మికులను గుర్తించేందుకు చీరాల, వాడరేవు ప్రాంతాల్లోని పలు హేచరీస్, రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్ల వద్ద ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. బాల కార్మికులను పనులలో పెట్టుకోవద్దంటూ యూనిట్ల యజమానులకు అవగాహన కల్పించారు. కార్మిక శాఖాధికారులు చీరాల, బాపట్ల ఏఎల్‌వోలు రామకృష్ణ, అబ్రహాంలు మాట్లాడారు. బాల కార్మికులను ఎవరైనా పనులలో పెట్టుకుని నిర్బంధించి వారితో వెట్టిచాకిరీ చేయిస్తే అట్టివారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా బాల, బాలికలను బంధించి వారితో వెట్టిచాకిరీ చేయించినట్లు గుర్తిస్తే తమ కార్యాలయాలకు సమాచారం అందించాలని వారు సూచించారు. కార్యక్రమంలో షాడోస్ సంస్థ ప్రతినిధి, న్యాయవాది రాజా సాల్మన్, సోషల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్ విజయ్ ఆనంద్, షాడోస్ సిబ్బంది భాగ్యలక్ష్మి, అలేఖ్య పాల్గొన్నారు.



రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్ల వద్ద తనిఖీల్లో పాల్గొన్న అధికారులు

లింగ నిర్ధారణ చట్టాన్ని అమలు చేయాలి

గుంటూరు కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి

గుంటూరు వెస్ట్ : గర్భస్థ లింగ నిర్ధారణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన చట్టం జిల్లా స్థాయి అథారిటీ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో నమోదు అయ్యే కొత్త, రెన్యూవల్ స్కానింగ్ సెంటర్లను తప్పనిసరిగా ప్రోగ్రామ్ అధికారులు తనిఖీ చేయాలన్నారు. జిల్లాలో మొత్తం 283 గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షా కేంద్రాలు ఉన్నాయన్నారు. వాటిలో నాలుగు రెన్యూవల్ , 12 మోడిఫికేషన్, రెండు క్యాన్సిలేషన్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. తెనాలి డివిజన్‌లో 25 స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు నిర్వహించామన్నారు. చట్టాన్ని ఉల్లంఘించే ఎవరినీ ఉపేక్షించవద్దని కలెక్టర్ ఆదేశించారు.

కిట్స్ త్వరగా పంపిణీ చేయండి

తెనాలిఅర్బన్: స్టూడెంట్ కిట్స్‌ను త్వరగా పంపిణీ చేయాలని గుంటూరు డీఈఓ పి.శైలజ ఆదేశించారు. తెనాలి మండలం కొలకలూరు, నందివెలుగు, ఖాజీపేటలోని జెడ్పీ హైస్కూల్స్‌ను శనివారం ఆమె పరిశీలించారు. కిట్స్ పంపిణీపై ఆరా తీశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని సూచించారు.ఎంఈవో ఎం.లక్ష్మీనారాయణ ఉన్నారు.

రైల్వే గేటు తాత్కాలికంగా మూసివేత

తాడేపల్లిరూరల్: మంగళగిరి నగర పాలక సంస్థ పరిధిలోని ఇప్పటం–మంగళగిరి మధ్య లెవల్ క్రాసింగ్ గేట్‌ను తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 24 నుంచి 27వ తేదీ వరకు పెదవడ్ల పూడి–కృష్ణాకెనాల్ జంక్షన్ మధ్య మూడో రైల్వే బెడ్ ఏర్పాటు చేయనున్నామని పేర్కొన్నారు.

క్లుప్తంగా

ముగిసిన చెన్నమల్లేశ్వరుని కల్యాణ మహోత్సవాలు

రేపల్లె రూరల్‌: పట్టణంలోని ఇసుకపల్లిలో గల శ్రీ భ్రమరాంబ సమేత చెన్నమల్లేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న త్రయాహ్నిక దీక్ష కల్యాణ మహోత్సవాలు శనివారం నాలుగో రోజుతో ముగిశాయి. ఈ సందర్భంగా ఔపోసన హోమం, బలిహరణ, పూర్ణాహుతి హోమం, వసంతోత్సవం, ధ్వజావరోహణం, ద్వాదశ ప్రదక్షిణాలు, పవళింపు సేవ తదితర పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. మొక్కుబడులు తీర్చుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రెండిళ్లలో బంగారు ఆభరణాల చోరీ



మార్టూరు: మండలంలోని వలపర్లలో తాళాలు వేసిన రెండిళ్లలో దొంగలు 23 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ చేసిన ఘటనలు శనివారం వెలుగు చూశాయి. ఏఎస్‌ఐ మహబూబ్‌ బాషా వివరాల మేరకు.. వలపర్ల గరటయ్య కాలనీలో వేర్వేరు ప్రాంతాల్లో నివాసం ఉంటున్న పరుచూరి సుకన్య, షేక్‌ మాబులాలు ఈనెల 18న పనుల మీద ఇళ్లకు తాళాలు వేసి వెళ్లారు. మరుసటి రోజు రాత్రి వచ్చి చూడగా తాళాలు ధ్వంసం చేసి బీరువాలను పగలగొట్టి ఉన్న విషయం గమనించారు. సుకన్య ఇంటిలో 11 గ్రాముల బంగారు ఆభరణాలు, మాబులా ఇంటిలో 12 గ్రాముల బంగారు ఆభరణాలను దొంగలు ఎత్తుకు పోయారు. ఈ మేరకు వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండిళ్లలో చోరీ జరిగిన తీరును ఏఎస్‌ఐ పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో బాపట్ల జిల్లా వాసి మృతి

ద్రోణాదులకు చెందిన కోటగిరి రాజుగా గుర్తింపు



యడ్లపాడు: మండల కేంద్రమైన యడ్లపాడు నక్క వాగు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బాపట్ల జిల్లా వాసికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం ..బాపట్ల జిల్లా మార్టూరు మండలం ద్రోణాదుల గ్రామానికి చెందిన కోటగిరి రాజ (26) వైద్యపరీక్షల కోసం గుంటూరు వచ్చి తిరిగి బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. రాత్రి 7.30 గంటల సమయంలో యడ్లపాడు నక్కవాగు సమీపంలోకి రాగానే అదే మార్గంలో వెళ్తున్న కారు అడ్డొచ్చిన గేదెల్ని తప్పించే క్రమంలో బైక్‌ను ఢీకొంది. దీంతో బైక్‌పై ఉన్న రాజా కిందపడటంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. కారు ఆగకుండా వెళ్లిపోయింది. కానీ నంబర్‌ ప్లేట్‌ అక్కడే పడటంతో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్థానికులు గమనించి 108కి సమాచారం ఇవ్వడంతో బాధితుడిని చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జె. శామ్యూల్‌ రాజీవ్‌ కుమార్‌ తెలిపారు.

డయేరియా బాధితులకు మెరుగైన వైద్య సేవలు

- 24 గంటల పాటు వైద్యశిబిరాలు
- డీఎం అండ్‌ హెచ్‌వో రవి



ఆరోగ్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎం అండ్‌ హెచ్‌వో రవి

దాచేపల్లి: డయేరియా బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని డీఎం అండ్‌ హెచ్‌వో బి.రవి అన్నారు. మండలంలోని కేసానుపల్లి గ్రామంలో డయేరియా ప్రబలడంతో శనివారం ఆయన పర్యటించారు. వ్యాధి ప్రభావిత ప్రాంతాల్లో పరిసరాలు పరిశీలించారు. అనంతరం బాధితులను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. తాగునీరు కలుషితమయ్యే అవకాశం ఉన్న మంచినీటి బోరుని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆహార పదార్థాల వల్లే డయేరియా (అతిసార) ప్రబలే అవకాశం లేదని, తాగునీటి వల్లే ఎక్కువ అవకాశం ఉందన్నారు. కాలనీ వాసులు ఉపయోగించే మంచినీటి బోరు శ్యాంపిల్స్‌ తీసి ల్యాబ్‌కి పంపించి పరీక్ష చేయిస్తే నెగిటివ్‌ వచ్చిందన్నారు. మరోసారి తీసి ల్యాబ్‌కి పంపిస్తామని ఆయన చెప్పారు. ఇప్పటి వరకు 11 మంది అతిసారా బారిన పడినట్లుగా గుర్తించామని, పలువురు ప్రైవేట్‌ హాస్పిటల్స్‌లో చికిత్స పొందుతున్నారని ఆయన వివరించారు. వంగూరి నాగమ్మ, వినుకొండ అవ్వమ్మ ఆరోగ్య పరిస్థితి కాస్త ఇబ్బందిగా ఉందని, మిగతా బాధితులకు ఎటువంటి సమస్యలు లేవని ఆయన తెలిపారు. 24 గంటల పాటు సేవలు అందించేలా వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచామని, అతిసార బారినపడితే తక్షణ వైద్యసేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన తెలియజేశారు. అతిసారా ప్రబలకుండా మురికి కాలువల్లో పూడికలు తీయించేలా చర్యలు తీసుకున్నామన్నారు. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని ఆయన సూచించారు. డీఎం అండ్‌హెచ్‌వో వెంట ఎంపీడీవో వెంకట రమణ, ఈవోపీఆర్డీ జోషిబాబు, డాక్టర్లు ఇమ్మడిశెట్టి అమూల్య, మధు, సర్పంచ్‌ శ్రీపతి ప్రసాద్‌, ఎంపీటీసీ సభ్యుడు చెట్టిపాగు ఏసుదాసు, నాయకులు నెల్లూరి రామ కోటయ్య, పంచాయతీ కార్యదర్శి నాగేండ్ల రత్నం, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.



పారిశుద్ధ్యం పనులు చేస్తున్న సిబ్బంది

మరో ఐదు అతి సారా కేసులు

మండలంలోని కేసానుపల్లి గ్రామంలో కొత్తగా ఐదు అతిసార కేసులు శనివారం నమోదయ్యాయి. గ్రామానికి చెందిన పల్లపు శివనాగదుర్గ, తుపాకుల అరవింద్‌, వినుకొండ యాకోబు, కొమ్ము అనూష, మీసాల మరియమ్మ వ్యాధి బారిన పడ్డారు. బాధితులు ప్రభుత్వ, ప్రైవేట్‌ హాస్పిటల్స్‌లో చికిత్స పొందుతున్నారు. ఎస్సీ కాలనీలోని చర్చిలో ప్రత్యేకంగా వైద్యశిబిరం ఏర్పాటు చేసి ప్రాథమిక వైద్య సేవలు అందిస్తున్నారు. శిబిరంలో డాక్టర్లు అమూల్య, మధు, ఆరోగ్య సిబ్బంది వైద్య సేవలు అందిస్తున్నారు.

మెరుగైన పారిశుద్ధ్యానికి చర్యలు

కేసానుపల్లిలో పారిశుద్ధ్యం మెరుగుదలకు అధికారులు చర్యలు చేపట్టారు. గ్రామంలోని మురికి కాలువల్లో పూడికతీత పనులు చేపట్టారు. ప్రతివీధిలో బ్లీచింగ్‌ చల్లారు. మంచినీటి ట్యాంక్‌లను శుభ్రం చేశారు. మురికి కాలువల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టారు. ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరా చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. కొన్నిరోజుల పాటు బోర్లలో నీరు వాడవద్దని ప్రజలకు సూచించారు. సర్పంచ్‌ శ్రీపతి ప్రసాద్‌, ఎంపీటీసీ సభ్యుడు చెట్టిపాగు ఏసుదాసు, నాయకులు నెల్లూరి రామకోటయ్య, పంచాయతీ కార్యదర్శి నాగేండ్ల రత్నం తదితరులు పనుల్ని పర్యవేక్షిస్తున్నారు.

అరుదైన ఆలయ సందర్శన అదృష్టం

ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు



చాగంటి కోటేశ్వరరావు దంపతులకు జ్ఞాపిక బహూకరిస్తున్న ఆలయ అర్చకులు

తెనాలి: స్థానిక షరాఫ్‌ బజారులోని శ్రీ వర్చలా సమేత శ్రీపంచముఖ ఆంజనేయస్వామి దేవాలయాన్ని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త, బ్రహ్మశ్రీ డాక్టర్‌ చాగంటి కోటేశ్వరరావు దంపతులు శనివారం సందర్శించారు. వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. చాగంటి దంపతులు ముందుగా ఆలయంలోని గోమాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పంచముఖ ఆంజనేయస్వామిని దర్శించుకుని, విశేష పూజలు జరిపారు. ఆలయ వంశపారంపర్య అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి, కిరణ్‌ ,సురేష్‌ , వైఖానస పండితులు కలిసి కోటేశ్వరరావు దంపతులను ఆశీర్వదించారు. ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యుడు ఎస్‌బీ శివ, ఈవో అవుతు శ్రీనివాసరెడ్డి స్వామివారి శేష వస్త్రాలను అందజేశారు. కోటేశ్వరరావు మాట్లాడుతూ పంచముఖ ఆంజనేయ స్వామి దేవస్థానం ఉజ్జయిని తర్వాత తెనాలిలో ఉందని, అలాంటి అరుదైన దేవాలయాన్ని సందర్శించడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. స్వామి పంచముఖాల దర్శనానికి వీలుగా ఇక్కడ ప్రత్యేక ద్వారాలు ఏర్పాటు చేయడం అద్భుతంగా ఉందన్నారు. ఐదు ముఖాల స్వామి స్వరూపాన్ని దర్శించుకుంటే పరబ్రహ్మస్వరూపాన్ని దర్శించినట్టేనని తెలిపారు. పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయం ఇక్కడ ఉండటం తెనాలి పట్టణ అదృష్టమన్నారు. దేవాలయంలో సువర్చలా అమ్మవారు మూల రూపంలో ఉండటం సంతోషకరమన్నారు. సువర్చలా అమ్మవారికి ముమ్మాటికీ ఆంజనేయస్వామి పత్నియే అని పేర్కొన్నారు. సువర్చలా,ఆంజనేయ స్వామి కల్యాణం ఎంతో గొప్పది అన్నారు. దేవాలయంలో వైఖానస సంప్రదాయలో పూజలు నిర్వహించడం అద్భుతమని తెలిపారు. తనకు బహుమతులు ఎవ్వరూ ఇవ్వొద్దని, అందుకు బదులుగా మొక్కలకు నీళ్లు పోయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్య

- జిల్లాలో 568 మంది విద్యార్థులకు సీట్ల కేటాయింపు
- ఇప్పటికే 465 మంది కార్పొరేట్‌ స్కూళ్లలో చేరిక

యడ్లపాడు: జిల్లాలో ఐబీ, ఐసీఎస్సీ, సీబీఎస్సీ, స్టేట్‌ సిలబస్‌ బోధన చేస్తూ విద్యాశాఖ వద్ద రిజిస్ట్రేషన్‌ చేసుకున్న ప్రైవేటు, అన్‌ఎయిడెడ్‌ పాఠశాలలు విధిగా తమ స్కూళ్లలో ఒకటో తరగతి ప్రవేశాలకు 25 శాతం ఉచిత సీట్లను కేటాయించాలి. ఇందులో భాగంగా పల్నాడు జిల్లాలో విద్యాహక్కు చట్టంలోని సెక్షన్‌ 12(1)(సి) ద్వారా విద్యాశాఖ గతేడాది 259 మంది విద్యార్థులకు ఒకటో తరగతిలో ప్రవేశం కల్పించింది. 2024–25 విద్యా సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా సుమారు 1000 మంది తల్లిదండ్రులు ఉచిత విద్యకు దరఖాస్తులు చేసుకున్నారు. వీటిని పరిశీలించి అర్హత కలిగిన వారిని 568 దరఖాస్తుల్ని గుర్తించారు. వాటిలో మొదటి విడతగా 521మంది విద్యార్థుల్ని ఎంపిక చేశారు. వీరిలో 436 మంది అడ్మిషన్లు పొందారు. రెండో విడతగా 47 మందికి ఉచిత సీట్లను కేటాయించగా వీటిలో 26 మంది చేరారు. జిల్లాలో మొత్తం 465 మంది విద్యార్థులు ఉచిత విద్యాహక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోగా, మరో 103 మంది ఇంకా పాఠశాలల్లో చేరాల్సి ఉంది.

విజ్ఞాన్‌ యూనివర్సిటీ - సీడాక్‌ల మధ్య అవగాహన ఒప్పందం



ఒప్పంద పత్రాలను సుదర్శన్‌కు అందజేస్తున్న పి.నాగభూషణ్‌, లావు రత్తయ్య తదితరులు

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్‌ యూనివర్సిటీ – బెంగుళూరులోని సీడాక్‌ (సెంటర్‌ ఫర్‌ డెవలప్‌మెంట్‌ ఆఫ్‌ అడ్వాన్స్‌డ్‌ కంప్యూటింగ్‌) ల మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని శనివారం యూనివర్సిటీ వైస్‌ చాన్స్‌లర్‌ పి.నాగభూషణ్‌ తెలిపారు. సీడాక్‌ ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ ఎస్‌డీ. సుదర్శన్‌తో వర్సిటీ వైస్‌ చాన్స్‌లర్‌ పి.నాగభూషణ్‌ అవగాహన ఒప్పందానికి సంబంధించిన పత్రాలను మార్చుకున్నారు. వైస్‌ చాన్స్‌లర్‌ మాట్లాడుతూ ఈ అవగాహన ఒప్పందం వల్ల విద్యార్థులకు, అధ్యాపకులకు రీసెర్చ్‌ అండ్‌ డెవలప్‌మెంట్‌, ప్రొడక్ట్‌ డెవలప్‌మెంట్‌, ట్రెనింగ్‌ అండ్‌ స్కిల్‌ డెవలప్‌మెంట్‌ రంగాలలో ప్రత్యేక శిక్షణ లభిస్తుందన్నారు. ఇండస్ట్రీ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆవిష్కరణలను ప్రోత్సహించడంతో పాటు విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రాక్టికల్‌గా అనుభవాలను కల్పిస్తామన్నారు. సీడాక్‌ ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ ఎస్‌డీ.సుదర్శన్‌ మాట్లాడుతూ విద్యార్థులను సరికొత్త టెక్నాలజీల వైపు ప్రోత్సహించడంతో పాటు వారికి ఆయా రంగాలలో తర్ఫీదునివ్వడమే ఈ ఒప్పందం లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో సీడాక్‌ సైంటిస్ట్‌–ఎఫ్‌ హరిబాబు, చైర్మన్‌ లావు రత్తయ్య పాల్గొన్నారు.

లాంఫాంలో ఘనంగా ఏరువాక పౌర్ణమి వేడుకలు



గుంటూరు రూరల్‌: ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం లాంఫాంలో శనివారం ఏరువాక పౌర్ణమి వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. సంప్రదాయ పద్ధతిలో జోడెద్దులను అలంకరించి, నాగలి కట్టి దుక్కి దున్నారు. పుడమి తల్లిని పూజించారు. అరకతో పొలం దున్ని కంది విత్తనాలు నాటారు. ఈ ఏడాది వర్షాలు బాగా కురిసి పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విస్తరణ సంచాలకురాలు డాక్టర్‌ బి.ప్రమీలారాణి, హోమ్‌సైన్స్‌ డీన్‌ డాక్టర్‌ బి. శ్రీలక్ష్మి, అసోసియేట్‌ డైరెక్టర్‌ ఆఫ్‌ రీసెర్చ్‌ డాక్టర్‌ ఎస్‌వీవీఎస్‌ దుర్గాప్రసాద్‌, డాక్టర్‌ శ్రీలత, శాస్త్రవేత్తలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్‌ మృతి

మంగళగిరి: పట్టణ పరిధిలోని కాజా ఐజేఎం విల్లాస్‌లో విద్యుత్‌ షాక్‌కు గురై ఎలక్ట్రీషియన్‌ మృతి చెందాడు. శనివారం రూరల్‌ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నవులూరుకు చెందిన షేక్‌ జాకీర్‌ (35) ఏసీ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ఐజేఎం విల్లాస్‌లో మరమ్మతులు చేసేందుకు వెళ్లాడు. పని చేస్తున్న సమయంలో విద్యుత్‌ షాక్‌కు గురై ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. పోలీసులు అక్కడకు చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని ఎన్నారైకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. జాకీర్‌కు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె. కోటేశ్వరరావు



మాట్లాడుతున్న కోటేశ్వరరావు

చిలకలూరిపేట: ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె. కోటేశ్వరరావు కోరారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట పట్టణంలోని ఎస్టీయూ కార్యాలయంలో సంఘ ఏరియా కార్యదర్శి వి. అక్కయ్య అధ్యక్షతన ప్రాంతీయ శాఖల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పదోన్నతులు నిర్వహించాలని, బదిలీలను కౌన్సెలింగ్‌ ద్వారా పారదర్శకంగా నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు. సంఘ రాష్ట్ర పూర్వ కార్యదర్శి పోటు శ్రీనివాసరావు మాట్లాడుతూ మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ కోసం లక్షలాది మంది నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులు ఎదురు చూస్తున్నారని తెలిపారు. వెంటనే ప్రభుత్వం విడదల చేయాలని డిమాండ్‌ చేశారు. గతంలో డీఎస్సీకి ఫీజు చెల్లించిన వారిని కూడా పరిగణించి న్యాయం చేయాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన టెట్‌ ఫలితాలను ప్రకటించాలని కోరారు. డీఏ, పీఆర్‌సీ బకాయిలు వీలైనంత త్వరగా చెల్లించాలన్నారు. ప్రావిడెంట్‌ ఫండ్‌ అకౌంట్‌ ఏర్పాటు చేయాలన్నారు. విద్యా వ్యవస్థలో బోధనేతర పనుల యాప్‌ల భారం తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి విద్యావ్యవస్థలో మార్పులు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో ఎస్టీయూ పట్టణ అధ్యక్షుడు మేకల కోటేశ్వరరావు, కార్యదర్శి వడ్లాన జయప్రకాశ్‌, మండల అధ్యక్షుడు బొంతా రవి, ప్రధాన కార్యదర్శి షేక్‌ మస్తాన్‌వలి, యడ్లపాడు మండల అధ్యక్షుడు జి. కోటేశ్వరరావు, కార్యదర్శి సతీష్‌ పాల్గొన్నారు.

విజయకీలాద్రిపై వేదభాష్య సభ



వేదభాష్య సభలో పాల్గొన్న దెందుకూరి వెంకటప్ప యజ్ఞ నారాయణ సోమయాజి తదితరులు

తాడేపల్లి రూరల్‌: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై శనివారం వేదభాష్యసభను నిర్వహించారు. ఈ సందర్భంగా జీయర్‌ ఎడ్యుకేషనల్‌ ట్రస్ట్‌ ఆశ్రమ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ దెందుకూరి వెంకటప్ప యజ్ఞ నారాయణ సోమయాజి అధ్యక్షతన మీమాంస శాస్త్రం , వేదాంగాలలో చర్చ నిర్వహించామని చెప్పారు. సభలో చింతమనేని ఆంజనేయ ఘనాపాఠి, జీయర్‌ ఎడ్యుకేషనల్‌ ట్రస్ట్‌ వేద, ఆగమ ఉపాధ్యాయులు పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమ సమన్వయకర్త మంగిపూడి వెంకటశాస్త్రి ఘనాపాఠి మాట్లాడుతూ ప్రతి మాసం ఈ వేద భాష్య సభను నిర్వహించనున్నామని, దాని తర్వాత విద్యార్థులకు వేదాలలోని అర్థాన్ని తెలిపేలా కొనసాగుతుందని వివరించారు.

రక్తహీనత నియంత్రణకు ప్రభుత్వం చర్యలు



విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

శావల్యాపురం: రక్తహీనత నివారణ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని జిల్లా వైద్య ఆరోగ్య బృందం సభ్యులు (టాస్క్‌ఫోర్సు) రావిపాటి వన్నూరు, అదివన్నె నీలకంఠశ్వర రావు అన్నారు. శనివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లోని విద్యార్థులకు రక్తహీనత (హిమోగ్లోబిన్‌) వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాతా శిశు మరణాలు నియంత్రణకు రక్తహీనత వైద్య పరీక్షలు ఎంతగానో దోహదపడతాయన్నారు. చిన్నారులు, కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలు రక్తహీనత కారణంగా మృత్యువాత పడకుండా ఉండటానికి ప్రభుత్వ ముందు జాగ్రత్త చర్యలు చేపట్టిందని తెలిపారు. రక్తహీనత లోపాలు ఉన్న వారికి మెరుగైన వైద్యసేవలు సకాలంలో అందేలా వైద్య ఆరోగ్య అధికారులు, సిబ్బంది బాధ్యత వహించాలన్నారు. రక్తహీనత నమోదు ఆధారంగా అవసరమైన వారికి మందు బిళ్లలు, అత్యవసరమైన వారికి వైద్యులు సూచనలు మేరకు వైద్య సేవలతో పాటు పర్యవేక్షణ చేసి వారి ప్రాణాలకు ముప్పు వాటిల్లకుండా పోషకాహారం అందేలా పర్యవేక్షణ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రావిపూడి రమ్య, సూపర్‌వైజర్లు అలవలపూడి ఏడుకొండలు, ఉమాదేవి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బొడ్డపాటి విజయలక్ష్మి, ఆరోగ్య కార్యకర్త ఇంకొల్లు నాగలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీలు పృథ్వీరాణి, శంకర్‌సింగ్‌, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.